# నేడు మెడికల్ షాపుల బంద్

## ఆన్‌లైన్ మందుల విక్రయాలపై కెమిస్టుల శంఖారావం

- ఆన్లైన్ మెడిసిన్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసన
- 220(ఈ), 817 (ఈ) నోటిఫికెషన్లను సవరించాలని డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా బంద్ కానున్న 1200 మెడికల్ షాపులు
- స్తంభించనున్న ఔషధ సరఫరా..అత్యవసర మందులకు జిల్లా కమిటీ చర్యలు
- ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే నిరవధిక ఆందోళన

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మే19(నినాదం)

**అఖిల భారత ఔషధ వ్యాపారుల సంఘం పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నేడు మెడికల్ షాపులు బంద్ పాటించనున్నాయి. ఆన్లైన్ మందుల విక్రయాలకు నిరసనగా ఆలిండియా అర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ (ఏఐఓసీడీ) పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సుమారు 1200 మెడికల్ షాపులు ఒక్క రోజు బంద్లో పాల్గొననున్నాయి. ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న ఎమర్జెన్సీ ఫార్మసీలు మాత్రం తెరిచి ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అత్యవసర మందులను వినియోగదారులకు అందుబాటులో ఉంచేలా కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ చర్యలు తీసుకుంది.**

### ఆన్లైన్ ఫార్మసీతో విచ్చవిలవిడిగా విక్రయాలు..

మెడికల్ షాపులతోపాటు కొన్ని ఔషధ సరఫరా సంస్థలు కూడా ఈ బంద్ పాలుపంచుకోనున్నాయి. పెద్ద కార్పొరేట్ కంపెనీల అండదండలతో నడుస్తున్న ఆన్లైన్ ఫార్మసీలు భారీ డిస్కౌంట్లు ఇస్తూ సంప్రదాయ మెడికల్ షాపులకు నష్టం కలిగిస్తున్నాయని కెమిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న ఫార్మసీలు ఈ పోటీని తట్టుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని, ఆన్లైన్ ఫార్మసీని నియంత్రించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆన్లైన్ కంపెనీలు తక్కువ ధరలకు మందులను అమ్మడం వల్ల స్థానిక వ్యాపారులు నష్టపోతున్నారని ఆరోపిస్తున్నారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్లు మిస్ యూజ్ అవుతున్నాయని, డ్రగ్స్ కూడా విచ్చవిలవిడిగా ఆన్లైన్లో విక్రయాలు అవుతున్నాయని ఆరోపించారు. కార్పొరేట్ సెక్టార్లు ఇస్తున్న డిస్కౌంట్లను నియంత్రించాలని, ధరల నియంత్రణలో నిబంధనలు పాటించకుండా నేషనల్ ప్రైజ్ అథారిటీ ప్రకారం విక్రయాలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



### కార్పొరేట్ డిస్కౌంట్లతో చిన్న వ్యాపారుల నోట్లో మట్టి!

నేటి బంద్‌కు తెలంగాణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట అసోసియేషన్ (టీటీసీడీఏ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఆన్లైన్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా ఎలాంటి భౌతిక తనిఖీల్లేకుండా మందులను విక్రయించడం వల్ల ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఒకే ప్రిస్క్రిప్షన్ను పలుమార్లు ఉపయోగించి మందులు పొందే అవకాశం ఉండటంతో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించింది. కార్పొరేట్ సంస్థలు భారీ డిస్కౌంట్లతో మందులను విక్రయిస్తూ మార్కెట్ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయని, దీనివల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దశాబ్దాలుగా సేవలందిస్తున్న చిన్న మెడికల్ షాపుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది.

కోవిడ్ సమయంలో అత్యవసర పరిస్థితుల కోసం జారీ చేసిన 220(ఈ) నోటిషికేషన్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, ఈ-ఫార్మసీల జీవో 817 (ఈ)ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఆన్లైన్ విక్రయాలపై ప్రభుత్వం కఠిన నిబంధనలు తీసుకురాకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని అసోసియేషన్ హెచ్చరించింది. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఆన్లైన్ మందుల అమ్మకాలు, కార్పొరేట్ చైన్ ఫార్మసీలు ఇస్తున్న భారీ డిస్కౌంట్లతో సాధారణ రిటైల్, ల్సెల్ కెమిస్టులు తీవ్రంగా నష్టపోతు న్నారని అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. దేశవ్యా ప్తంగా ఉన్న లక్షలాది మంది చిన్న, మధ్య తరహా వ్యాపా రులు నిలదొక్కుకోవడం కష్టంగా మారిందని తెలిపింది. ఈ బంద్ సమయంలో అత్యవసర మందుల కొరత లేకుండా పలు జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపింది.

### ఇది కేవలం వ్యాపార సమస్య కాదు

**- కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

ఇది కేవలం వ్యాపార సమస్య కాదు. ఆరోగ్య భద్రతకు సంబంధించిన విషయం కూడా, ప్రభుత్వం ఈ డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే ప్రజారోగ్య పరిరక్ష దృష్ట్యా మేం నిరవధిక ఆందోళనకు దిగాల్సి వస్తుందని కెమిస్ట అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ తెలిపింది. అక్రమ ఈ 'ఫార్మసీలు ప్రజారోగ్యానికి ముప్పు, ఏఐ ఆధారిత నకిలీ ప్రిస్క్రిప్షన్ల ద్వారా యంటీబయోటిక్స్, అలవాటు చేసే మందులు నియంత్రణ లేకుండా అందుబాటులోకి రావడం వల్ల యాంటీమై క్రరోబియల్ రెసిస్టన్స్ (ఏఎంఆర్) వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. జిల్లాలో దాదాపు 1200 షాపులు ఉన్నాయి. వీటి మీద ఆధారపడి దాదాపు 10వేల కుటుంబాల వరకు జీవిస్తున్నాయి. ఈ ఆన్‌లైన్ విధానం మూలంగా వారి పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోవాలని జిల్లా అధ్యక్షులు ఉడుముల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కంభంపాటి రవి, కోశాధికారి లక్ష్మణాచారి, కొత్తగూడెం పట్టణ కమిటీ అధ్యక్షులు పెమ్మసాని అనిల్, ప్రధాన కార్యదర్శి డిల్లి వెంకటేశ్వరరావు, కోశాధికారి శివనాధుల గోపాలకృష్ణమూర్తి కోరారు.

### ప్రధాన డిమాండ్లు ఇలా..

1. కార్పొరేట్ సంస్థల అనైతిక డిస్కౌంట్లను అరికట్టేందుకు 'లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్' విధానాన్ని అమలు చేయాలి.
2. ఫార్మా రంగంలో పారదర్శకత, నైతిక వ్యాపార ప్రమాణాలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలి.
3. ఆన్లైన్ ఫ్లాట్ఫారంల ద్వారా జరిగే అక్రమ మందుల అమ్మకాలను పూర్తిగా నిరోధించి, నకిలీ నాణ్యత లేని మందుల సరఫరాను అడ్డుకోవాలి.
4. ఆన్లైన్, చైన్ ఫార్మసీల అనైతిక డిస్కౌంట్ విధానాలపై నియంత్రణ తీసుకురావాలి.
5. చిన్న తరహా రిటైల్ వ్యాపారుల మనుగడను కాపాడేలా ట్రేడ్ మార్జిన్లను రక్షించాలి.

# పాత పద్ధతిలోనే అక్రిడిటేషన్‌లు ఇవ్వాలి

- కొత్త జీవోతో తీవ్ర నష్టం జరుగుతోందని అభ్యంతరం
- కమిటీ సభ్యులకు, జిల్లాకు 4 కార్డులను ఇవ్వడాన్ని తిరస్కరించిన కమిటీ
- ఎమ్ పానల్‌లో ఉన్న ప్రతి పత్రిక, ఎలక్ట్రానిక్, కేబుల్ ఛానళ్లకు కార్డులు ఇవ్వాలని తీర్మానం...
- జర్నలిస్టులు అందరికీ న్యాయం చేస్తానని కలెక్టర్ భరోసా
- కమిటీ నిర్ణయం పట్ల జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల హర్షం

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మే19(నినాదం)

ప్రభుత్వ కొత్త జీవో 252 నిబంధనలు పాత్రికేయులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని భద్రాద్రి జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు కలెక్టర్ ఎదుట అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. పెద్ద పత్రికల విషయంలో నిబంధన ప్రకారం అక్రిడేషన్ కమిటీ సభ్యులతో పాటు నాలుగు కార్డులు అందిస్తామని డిపిఆర్ఓ ప్రస్తావన తేగా, జిల్లా కమిటీ జిల్లా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తిరస్కరించారు. తమకు కార్డు ప్రస్తుతం అవసరం లేదని, జిల్లాలోని మండలాల రిపోర్టర్లకు కార్డు అందించినప్పుడే తాము కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రభుత్వం నిబంధన ప్రకారం పెద్ద పత్రికలు తొలుత నాలుగు కార్డులను మంజూరు చేస్తున్నామని తెలిపారు. తమ జిల్లా వ్యాప్తంగా మండలాల్లో ఇచ్చినప్పుడే ఆ నాలుగు కార్డులు కూడా తీసుకోవడం జరుగుతుందని కమిటీ సభ్యులు కలెక్టర్‌కు స్పష్టం చేశారు. ఎం పానల్లో ఉన్న ప్రతి పత్రికకు ఎలక్ట్రానిక్ ఛానళ్లకు, కేబుల్ ఛానళ్లకు సైతం కార్డులు ఇవ్వాలని కమిటీ సభ్యులు పట్టుబట్టారు. దీని పట్ల స్పందించిన కలెక్టర్ జిల్లాలో ఏ రిపోర్టర్‌కు అన్యాయం జరగకుండా చూస్తామని, మీకు సంబంధించిన డిమాండ్లు ఏమైనా ఉంటే దరఖాస్తు సమర్పించాలని సూచించారు. పెద్దపత్రికలకు జిల్లా కేంద్రంలో, కార్పొరేషన్, భద్రాచలం



టెంపుల్ ఏరియా, నియోజకవర్గాలతో పాటు ఎలక్ట్రానిక్ మీడియాకు జిల్లాలో 9 కార్డులు, కేబుల్ చానళ్లకు కూడా డిస్ట్రిక్ట్ కార్డులు ఇవ్వాలని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి కలెక్టర్‌కు అందించారు. తీర్మాన కాపీని స్వీకరించిన కలెక్టర్ ఐ అండ్ పిఆర్ కమిషనర్‌తో మాట్లాడి జిల్లాలోని జర్నలిస్టులు అందరికీ న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో డిపిఆర్ఓ అజ్గర్ హుస్సేన్, కమిటీ సభ్యులు కల్లోజీ శ్రీనివాస్, బి వి. రమణారెడ్డి, వట్టికొండ రవి, ఎంఏ. వాహెద్, జి.వెంకటేశ్వర్లు, మొబగాపు ఆనంద్, మాటేటి మధు, ఎండి.యాకుబ్ పాషా, నాగచంద్ర, ప్రశాంత్, ఆర్టీసీ అధికారి వైఎన్‌రావు, పిల్లి రాజేష్, ఫణికుమార్, మోక్షిత్, సిబ్బంది పాల్గొన్నారు.

